న్యాయం జరిగే వరకు **పోరాటం**
» ఎన్‌హెచ్‌పీఎస్ జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్

వ్యవసాయ పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక శిక్షణ 6

మహిళలతో గౌరవప్రదంగా మెలగాలి
» జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజనీ



వైద్య విద్యార్థులతో కలిసి నృత్యం చేస్తున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

సంబురంగా 'ట్రెడిషనల్ డే'

- సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం నాగర్ కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థులు నిర్వహించిన 'ట్రెడిషనల్‌డే' (సాంప్రదాయ దినోత్సవం) కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో పాటలు, నృత్యాలు, నాటికలు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించారు. కలెక్టర్ బదావత్ సంతోష్ వారితో కలిసి నృత్యం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను కళాశాలలో చదువుకుంటున్న సమయంలో ఇలాంటి వేడుకలో పాలొన్నానని గుర్తు చేశారు. వైద్య విద్యార్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవ చేయాలని సూచించారు. పట్టణాలు, నగరాల్లో వైద్య సేవలు సులువుగా అందుబాటులో ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటుందని, గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు సేవలందించడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘు, నాగర్‌కర్నూల్ డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మీ, వైద్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


సోమశిల వద్ద కృష్ణానదిలో పెరుగుతున్న నీటి మట్టం

సోమశిల వద్ద జలకళ

కొల్లాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాలకు జూరల నుంచి దిగువకు వస్తున్న వరద సోమశిల వద్ద కృష్ణానది జలకళను సంతరించుకుంది. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతున్న సోమశిల వద్ద కృష్ణానది అందాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. ఈ అందాలను తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి పర్యాటకులు శని, ఆదివారాలు భారీ సంఖ్యలో వస్తుంటారు. గతేడాది కన్న ఈ ఏడాది ఒక నెల ముందుగానే వరద రావడంతో నదిలో సాగుచేసిన పంటలు నీట మునిగాయి. ఓ వైపు పంటలు సాగుచేసిన రైతులు కన్నీరు పెడుతున్నారు. కృష్ణానది అందాలను చూసి పర్యాటకులు సంబురపడుతున్నారు.


వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

ధాన్యం సేకరణలో ఉమ్మడి జిల్లాలో

వనపర్తి టాప్

» అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను అభినందించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలో మునుపెన్నడూ లేనంత భారీగా ధాన్యం కొనుగోలు జరిగిందని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పౌరసరఫరాల శాఖ, డీఆర్‌డీవో మార్కెటింగ్ కో-ఆపరేటివ్ అధికారులతో వరి కొనుగోలుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ యాసంగిలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే గరిష్ఠంగా 2,77,461 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ఈసారి కొనుగోలు విషయంలో ఎదురైన సమస్యలను రాబోయే రోజుల్లో పునరావృతం కాకుండా ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని సూచించారు. 2023-24తో పాటు యాసంగి ధాన్యం మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి అందించే విధంగా మిల్లర్లపై ఒత్తిడి తీసుకురావాలని సివిల్ సప్లయ్ అధికారులను ఆదేశించారు. కొనుగోలులో పాలు పంచుకున్న అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లను అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీవో ఉమాదేవి, కో-ఆపరేటివ్ అధికారి రాణి, మార్కెటింగ్ అధికారి స్వరణ్‌సింగ్, సివిల్ సప్లయ్ డీఎం తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ బడి..

సమస్యల ఒడి

» శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాలలు

» వంట గదులు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు

» అద్దె భవనాల్లో విద్యార్థుల అవస్థలు

» ఉపాధ్యాయుల కొరతతో ఇక్కట్లు


బిజినేపల్లి: బుల్‌సింగ్‌తండాలో నిరుపయోగంగా మారిన పాఠశాల భవనాలు


పెద్దకొత్తపల్లి : పెచ్చులూడిన బాచారం ప్రాథమిక పాఠశాల

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, దుస్తులు అందించడం, మధ్యాహ్నం భోజనం వడ్డించడం వంటి పథకాలు అమలు చేస్తున్నా... పాఠశాలల పరిశుభ్రతపై దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.. ఈ నేపథ్యంలో సోమవారం 'ఆంధ్రజ్యోతి' నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించింది. జోగులాంబ గద్వాల జిల్లాలో విద్యుత్, వంట గదులు, మరుగుదొడ్లు లేని పాఠశాలలు దర్శనమిచ్చాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో శిథిలావస్థకు చేరిన భవనాలు కనిపించాయి. అదేవిధంగా వనపర్తి జిల్లా, అమరచింత మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు లేకపోవడం, పలు పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు జిల్లాల్లో చాలా చోట్ల శిథిలావస్థకు చేరిన పాఠశాలలు ఉండటంతో అద్దెభవనాల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు.

వివరాలు -7లో.. - ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్


పెద్దకొత్తపల్లి : శిథిలావస్థలో బాచారం పాఠశాల భవనం


శిథిలావస్థలో కల్వకుర్తి పీఎస్ దళితవాడ పాఠశాల

ఆంధ్రజ్యోతి విజిట్


శిథిలావస్థలో గద్వాల పట్టణంలోని గంజిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల


శిథిలావస్థలో తాడూరు పాఠశాల భవనం


అమరచింత ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అస్తవ్యస్తంగా ఉన్న మరుగుదొడ్లు

కలెక్టరేట్‌లో పురుగులమందు

తాగేందుకు యత్నం

- మా పొలంలోకి ఇతరులు వస్తున్నారని బాధితుల ఆందోళన


తమ పొలానికి సంబంధించిన డాక్యుమెంట్లను చూపిస్తున్న బాధితులు రాములు, సావిత్రమ్మ

గద్వాల క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తమ పొలంలోకి ఇతరులు దౌర్జన్యంగా వస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో కలెక్టరేట్ ముందు ఓ మహిళ తన వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగేందుకు ప్రయత్నించింది. దీన్ని పోలీసులు అడ్డుకున్నారు. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అయిజ మండల పరిధిలోని ఉప్పలకు చెందిన చాకలి రాములు, సావిత్రమ్మ దంపతులకు సర్వే నెం. 150లో 4.10 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. అయితే రాములు, సోమన్నలు అనే అన్నదమ్ములకు సర్వేనెం. 195లో భూమి ఉన్నదని, ఇద్దరు అన్నదమ్ములు ఇంతకుముందే నాలుగు ఎకరాల చొప్పున 8 ఎకరాల భూమిని పంచుకున్నారు. సోమన్నకు సంబంధించిన 4 ఎకరాల భూమిలో కేవలం రెండు ఎకరాలు మాత్రమే ఉన్నదని, మిగిలిన రెండు ఎకరాలు సర్వే. నెం. 150లో ఉన్నదని, తన భూమిని తనకు ఇవ్వాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని గతంలోనే చాకలి రాములు, సావిత్రమ్మలు అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సర్వే నెంబర్‌లో ఉన్న భూమి తమ సర్వే నెంబర్‌లో ఎలా ఉంటుందని, పదేపదే చెప్పినా వారు వినడంలేదన్నారు. ఈ విషయంలో అధికారులు వారికే మద్దతు తెలుపుతున్నారని బాధితులు ఆరోపించారు. ఇక చేసేది లేక సోమవారం కలెక్టర్ ముందు పురుగులమందు తాగి ఆత్మహత్యకు సావిత్రమ్మ ప్రయత్నిస్తుండగా గమనించిన పోలీసు సిబ్బంది వెంటనే సీసాలోని పురుగుమందును స్వాధీనం చేసుకున్నారు. తమకు న్యాయం జరుగకుంటే కలెక్టరేట్ ముందు కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటామని బాధితులు తెలిపారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ వారిని ఎస్పీ కార్యాలయానికి పంపించారు.

ఇంటర్ సప్లిమెంటరీలో మెరుగైన ఫలితాలు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష 2025 ఫలితాల్లో నాగర్‌కర్నూల్ జిల్లా ఇంటర్ మొదటి సంవత్సరంలో మొత్తం 3,142 మంది విద్యార్థులకు గాను 1,876 మంది ఉత్తీర్ణులయ్యారు. అందులో జనరల్‌లో 1,373 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 667 మంది పాస్ అయ్యారు. 1,769 మంది బాలికలకు గాను 1,209 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మొత్తం 1,904 మంది విద్యార్థులకు గాను 1,010 మంది పాసయ్యారు. అదేవిధంగా ఒకేషనల్ విభాగంలో మొదటి సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 626 మంది పరీక్షలు రాయగా 391 మంది పాసయ్యారు. ఓకేషనల్ ద్వితీయ సంవత్సరంలో మొత్తం 388 మందికి గాను 213 మంది ఉత్తర్ణులయ్యారు. రాష్ట్ర స్థాయిలో ఇంటర్ వార్షిక పరీక్షల కంటే సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని నాగర్‌కర్నూల్ జిల్లా ఇంటర్ విద్యా నోడల్ అధికారి వెంకటరమణ తెలిపారు.

గద్వాల జిల్లాలో..

గద్వాల సర్కిల్ : జోగులాంబ గద్వాల జిల్లా ఇంటర్ సప్లిమెంటరీ ఫస్టియర్ ఫలితాల్లో 58.87 శాతం, సెకండియర్ ఫలితాల్లో 51.64 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డీఐఈవో, ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ హృదయరాజు తెలిపారు. జనరల్ ఫస్టియర్‌లో 1,974 మంది విద్యార్థులు హాజరు కాగా 1,162 విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జనరల్ సెకండియర్ ఫలితాల్లో 976 మంది విద్యార్థులు హాజరుకాగా 504 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వృత్తి విద్య ఫస్టియర్ ఫలితాల్లో 274 మంది విద్యార్థులకు గాను 182 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ ఫలితాల్లో 197 మంది విద్యార్థులకు గాను 119 మంది ఉత్తీర్ణత సాధించారు.

వనపర్తి జిల్లాలో..

వనపర్తి విద్యావిభాగం : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాల్లో వనపర్తి జిల్లా వ్యాప్తంగా జనరల్, ఒకేషనల్ ప్రథమ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలకు 3,650 మంది హాజరు కాగా, 2,134 (58.47శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ పరీక్షలకు 2,110 మంది విద్యార్థులు హాజరు కాగా, 1,000 (47.39శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు వనపర్తి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య తెలిపారు.

ఏదీ అలనాటి వైభవం?

» ఆదరణకు నోచుకోని ఆలయాలు

» శిథిలమైపోతున్న కోట గోడలు, బురుజులు

» కనుమరుగవుతున్న గట్టు చరిత్ర


శిథిలావస్థలో రాయలకాలంలో శత్రురాజ్యాల నుంచి కాపాడుకోవడానికి నిర్మించిన సైనిక నిఘా కేంద్రం

6

భూ భారతిపై చిగురిస్తున్న ఆశలు

» రెవెన్యూ సదస్సులకు దరఖాస్తుల వెల్లువ

» ఏళ్లనాటి సమస్యలు పరిష్కారం అవుతాయనే ధీమాలో ఫిర్యాదుదారులు

» ఇప్పటి వరకు 14 మండలాల్లో 5,219 దరఖాస్తులు

» ఈనెల 20వ తేదీ వరకు కొనసాగనున్న సదస్సులు


పెబ్బేరు మండలంలోని వైశాఖాపూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సులో రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలతో సతమతమవుతున్న వారు భూ భారతితో పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో తీసుకొచ్చిన ధరణి చట్టం వలన ఉన్న సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్త సమస్యలు వచ్చాయి. భూ సమస్యలు పూర్తిగా పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చారు.

ఆన్‌లైన్‌లో నమోదు

భూ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారి నుంచి వినతులు స్వీకరించేందుకు గ్రామగ్రామాన రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వనపర్తి జిల్లాలోని 14 మండలాల్లో ఈ నెల 3వ తేదీన ప్రారంభించిన రెవెన్యూ సదస్సులు ఈనెల 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇప్పటి వరకు 211 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 5,219 దరఖాస్తులు అందాయి. వచ్చిన దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. సాదా బైనామా, అసైన్డ్ భూములకు సంబంధించిన దరఖాస్తులను మినహాయించి మిగిలిన వాటిని పరిశీలిస్తున్నారు. రెవెన్యూ గ్రామాల వారికి నోటీసులు జారీ చేసి దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నారు.

మార్గదర్శకాలు ఇలా

రెవెన్యూ అధికారులు దరఖాస్తులు పరిశీలించి ఫిర్యాదు సమర్పించిన రైతుతో పాటు సమీపంలోని రైతుకు నోటీసులు జారీ చేయనున్నారు. ఇరువురి వద్ద ఉన్న రికార్డులతో పాటు ఆధారాలు సమర్పించేందుకు ఏడు రోజులు గడువు విధిస్తారు. నిర్దేశిత గడువులోపు సమర్పించిన ఆధారాలు, దస్త్రాలను రెవెన్యూ కార్యాలయంలోని రికార్డులతో పోల్చిచూసి సమస్యను పరిష్కరించనున్నారు.

చదువుకుంటూనే..

ఆటల్లో శిక్షణకు అవకాశం

» క్రీడా పాఠశాలల్లో విద్యార్థుల ఎంపికలకు కసరత్తు

» వనపర్తి జిల్లా నుంచి 39 మంది విద్యార్థులు దరఖాస్తు

» మూడు స్థాయిల్లో కొనసాగనున్న ఎంపిక ప్రక్రియ

» 18, 19వ తేదీల్లో మండల స్థాయి ఎంపికలు

6

పక్కాగా వంద రోజుల ప్రణాళిక

» విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

» సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు

6

పక్కాగా వంద రోజుల ప్రణాళిక

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు



పలు అంశాలపైన సూచనలు చేస్తున్న సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ నారాయణ రావు

పెబ్బేరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : 'వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు ఆదేశించారు. మునిసిపాలిటీలో కొనసాగుతున్న వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్త కోట బైపాస్ రహదారి వెంట మొక్కలు నాటారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మునిసిపాలిటీలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు వంద రోజుల ప్రణాళిక ఉపయోగపడుతుందని తెలిపారు. మునిసిపాలిటీ అభివృద్ధికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. సకాలంలో పన్నులు వసూలు చేసి అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిషనర్ అశోక్‌రెడ్డి, మేనేజర్ గణేశ్‌బాబు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ యోగేశ్‌కుమార్, బురాన్, ప్రశాంత్, మహేశ్, ఉమావతి, బాలీశ్వరశర్మ, అశోక్, దీప్తి, రాములమ్మ, రాజు, కృష్ణ, గంగన్న, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలకు పంపించం

- గౌతమ్‌పల్లి గ్రామస్థుల తీర్మానం



తీర్మానం చేస్తున్న గ్రామస్థులు

తెలకపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపించబోమని నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల పరిధిలోని గౌతమ్‌పల్లి గ్రామస్థులు తీర్మానం చేసుకున్నారు. గౌతమ్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం తహసీల్దార్, ఎంఈవోలతో కలిసి సమావేశం ఏర్పాటు చేసుకొని, చర్చించుకున్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు చక్కగా పాఠాలు చెప్తున్నారని, ఈ సంవత్సరం ముగ్గురు విద్యార్థులకు గురుకుల పాఠశాలల్లో సీట్లు వచ్చాయని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సాయం అందించాలని, వలంటీర్‌ను నియమించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జాకీర్ అలీ గ్రామస్థులను అభినందించారు. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాబోధన ఉంటుందని, అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పాఠశాలలో చేర్పించేందుకు ముందుకొచ్చిన గ్రామస్థులకు ధన్యవాదాలు తెలిపారు. నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయులు రమేశ్, శ్రీరాములను అభినందించారు. విద్యార్థుల సంఖ్య పెరిగితే అన్ని సౌకర్యాలు సమకూరుస్తామని తెలిపారు. అవసరమైతే మరో టీచర్‌ను నియమిస్తామని చెప్పారు. గౌతమ్‌పల్లిని స్ఫూర్తిగా తీసుకొని మిగతా గ్రామాల ప్రజలు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను అందించారు.

యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

- రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువజన కాంగ్రెస్ ప్రముఖ పాత్ర పోషించాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి అన్నారు. అందుకే అన్ని విభాగాల్లో పనిచేస్తున్న యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్ అధ్యతన ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ మండల, గ్రామస్థాయి కమిటీలను పూర్తి చేయాలని కార్యకర్తలు, నాయకులు ఐవైసీ యాప్‌ను ఉపయోగించాలని కోరారు. రానున్న స్థానిక ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ సత్తాచాటాలని, ఎక్కువ సీట్లు యువజన కాంగ్రెస్‌కు ఇచ్చేలా ప్రయత్నం చేస్తానని, అదే విధంగా పార్టీ నియమించిన అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు ఖాలెద్ అహ్మద్, అరవింద్‌కుమార్ యాదవ్, శివంత్‌రెడ్డి, సంధ్య, మాజిద్, వెంకట్, మహేశ్‌యాదవ్, శ్రీనుయాదవ్, మోహన్‌నాయక్, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

- కాడా అధికారి వెంకట్‌రెడ్డి
- కోస్గిలో ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు ప్రారంభం

కోస్గి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కాడా అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం కోస్గి పట్టణంలోని 1737 సర్వే నెంబర్‌లో నిర్మించతలపెట్టిన ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి, కాంట్రాక్టర్, అధి కారులతో మాట్లాడారు. నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రేపటి నుంచి పనులు ప్రారంభించాల న్నారు. అనంతరం ప్రభుత్వ బాలికల వసతి గృ హన్ని ఆయన తనిఖీ చేశారు. హాస్టల్ భవనం నూతనంగా నిర్మించాలని, అందుకు ప్రణాళికలు తయారు చేయాలని స్థాని క అధికారులను ఆదే శించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 800 మంది విద్యార్థులు ఉ న్నారని, సరిపడా తరగతి గదులు, ఆట స్థలం లేదని కాంగ్రెస్ నాయకులు కాడా అధికారి దృ ష్టికి తీసుకెళ్లారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వార్లవిజయ్‌కుమార్, పార్టీ మండల అధ్య క్షుడు రఘువర్ధన్‌రెడ్డి, నాయకులు నరేందర్, తు డుం శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

ఏదీ అలనాటి వైభవం?

అలనాటి వైభవం కాలగర్భంలో కలిసిపోతోంది.. ఘన చరిత్ర కనుమరుగవుతోంది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని గట్టు గ్రామ దుస్థితి ఇది.. ఈ ప్రాంతం శ్రీకృష్ణదేవరాయుల ఏలుబడి కింద ఉండేది. అప్పట్లో దీనిని బంగారు గట్టుగా పిలిచేవారు. శత్రువుల దాడుల నుంచి రక్షణకు అప్పటి పాలకులు గ్రామం చుట్టు ఎత్తయిన కోట గోడలను నిర్మించారు. భారీ ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేశారు. శత్రువుల రాకను ముందుగానే గుర్తించేందుకు కోటకు నలువైపులా నిఘా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

- గట్టు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి)


- ఆదరణకు నోచుకోని ఆలయాలు
- శిథిలమైపోతున్న కోట గోడలు, బురుజులు
- కనుమరుగవుతున్న గత చరిత్ర




కోట లోపలికి వెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్న ముఖద్వారం



శత్రువులపై దాడి చేయడానికి రాతితో నిర్మించిన బురుజులు



రాయల కాలంలో నిర్మించిన నిరాదరణకు గురి అవుతూ దూపదీప నైవేద్యాలకు నోచుకోని ప్రాశస్త్యం గల రంగనాథస్వామి ఆలయం



శిథిలమైపోయి మొండి గోడలతో ఉన్న కోట గోడలు

గట్టు.. ఆయువు పట్టు

విజయనగర సామ్రాజ్యానికి గట్టు ఆయువుపట్టుగా ఉండేదని, ఇక్కడ రత్నాలు, ముత్యాలను, వజ్రాలను రాసులుగా పోసి విక్రయించేవారని స్థానికులు చెప్తుంటారు. రాజ్యంలోనే కీలక ప్రాంతం కావడంతో చీకటి పడిందంటే కోట లోపలికి ఎవ్వరిని వెళ్లనిచ్చేవారు కాదు. కోట చుట్టూ పటిష్ఠమైన కాపలా ఉండేది. సైనికులకు ఇక్కడే శిక్షణ కూడా ఇచ్చే వారని చెప్తుంటారు. గట్టు గ్రామం వేలాది ఎకరాల్లో దట్టమైన అటవీ ప్రాంతం విస్తరించి ఉండటంతో అటవీ జంతువుల సంచారం అధికంగా ఉండేది. దీంతో మృగాల భారి నుంచి కాపాడుకోవడానికి వ్యాపారులు, ప్రయాణికులు ఆయుధాలను వెంట తీసుకెళ్లే వారని స్థానిక పెద్దలు కథలు కథలుగా చెప్పుకుంటుంటారు. ఈ ప్రాంత రైతులు పంటలను సాగు చేసుకునేందుకు గ్రామం పక్కనే పెద్ద చెరువును నిర్మించారు. ఆ నీటితో వేలాది ఎకరాల్లో పంటలు సాగు చేసేవారు. ప్రజలకు తాగునీటిని సరఫరా చేసేవారు. ఈ చెరువు ఇప్పటికీ ప్రజలకు ఉపయోగపడుతూనే ఉంది.

పరాజయంతో సంస్థానంలో విలీనం

శ్రీకృష్ణదేవరాయులు పాలన అనంతరం రాజ్యాన్ని అధిష్ఠించిన చక్రవర్తులు గట్టు ప్రాంతంపై పట్టు సాధించలేక పోవడంతో శత్రువుల దాడి అధికమైంది. ఇక్కడ ఉన్న సంపదను దొంగలు కొల్లగొట్టుక పోయారు. గట్టు, ఆరగిద్ద గ్రామాల మధ్య గద్వాల సోమానాద్రిరాజుకు, రాయచూరు నవాబులకు మధ్య భారీ యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో గద్వాల రాజు విజయం సాధించడంతో ఈ ప్రాంతం సంస్థానంలోకి విలీనమైందని చరిత్ర చెపుతున్నది.

తవ్వకాలలో బయటపడ్డ విలువైన వస్తువులు

పురావస్తుశాఖ అధికారులు ఈ ప్రాంతంలో 50 ఏళ్ల క్రితం తవ్వకాలు జరిపారు. ఆ సమయంలో రాజుల కాలం నాటి ఖడ్గాలు, అభరణాలు, సైన్యం ఉపయోగించిన వస్తువులు, బంగారం వంటివి బయటపడ్డాయి. లభ్యమైన వాటిలో కొన్ని పరుల పాలు కాగా, మరికొన్నింటిని హైదరాబాద్‌లోని సాలర్జంగ్ మ్యూజియంలో భద్రపరిచినట్లు సమాచారం. అలాగే దీనిని రక్షిత ప్రాంతంగా ప్రకటించి ఎలాంటి తవ్వకాలూ జరుపరాదని ఆదేశాలు జారీ చేసింది. అయినా దుండగులు ఈ ప్రాంతంలో తవ్వకాలు జరుపుతూనే ఉంటారు.

ధూపదీప నైవేద్యాలు కరువు

రాయల కాలంలో గట్టులో ఎన్నో ఆలయాలు నిర్మించారు. వీటిలో సంత బజారులోని ప్రాథమిక పాఠశాల వెనుకనున్న రంగనాథస్వామి ఆలయం ప్రధానమైంది. అలాగే వేంకటేశ్వర స్వామి ఆలయంలో పాటు మరికొన్ని ఆలయాలున్నాయి. వాటికి విలువైన భూములు ఉన్నప్పటికీ ధూప దీప నైవేద్యాలు కరువయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గట్టు చరిత్రను భావితరాలకు అందించాలి



ఎంతో ప్రాశస్త్యం గల గట్టు చరిత్రను భావి తరాలకు అందించాలి. గ్రామంలో శిథిలం అవుతున్న చారిత్రక సంపదను కాపాడాలి. పురావస్తుశాఖ స్పందించి పురాతన కట్టడాలు, కోట బురుజులు, ఆలయాల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి. గట్టు చరిత్రను అధ్యయనం చేసి, పురావస్తు శాఖ అధికారులకు వివరించేందుకు నా వంతు ప్రయత్నం చేస్తాను.

- డాక్టర్ ఆంజనేయగౌడు, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్

చదువుకుంటూనే.. ఆటల్లో శిక్షణకు అవకాశం

- క్రీడా పాఠశాలల్లో విద్యార్థుల ఎంపికలకు కసరత్తు
- వనపర్తి జిల్లా నుంచి 39 మంది విద్యార్థులు దరఖాస్తు
- మూడు స్థాయిల్లో కొనసాగనున్న ఎంపిక ప్రక్రియ
- 18, 19వ తేదీల్లో మండల స్థాయి ఎంపికలు



వనపర్తి రాజీవ్ చౌరస్తా, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుకుంటూనే క్రీడల్లో శిక్షణ పొందుతూ రాణించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. అందుకోసం తెలంగాణ ప్రభుత్వం క్రీడా పాఠశాలలను నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో ఈ పాఠశాలలున్నాయి.

ఆయా పాఠశాలల్లో నాలుగవ తరగతిలో ప్రవేశం కోసం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ విద్యార్థుల ఎంపిక ప్రక్రియను ఈనెల 16న ప్రారంభించింది. అందుకోసం జిల్లాకు చెందిన 39 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. విద్యార్థుల ఎంపిక మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో మూడు విడతలుగా నిర్వహించనున్నారు. వాటిల్లో సత్తాచాటి ఎంపికైన విద్యార్థులకు ఈ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు, ఉత్తమ క్రీడా శిక్షణను అందిస్తారు.

మూడు పాఠశాలల్లో 120 సీట్లు

రాష్ట్రంలోని హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో 120 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతీ పాఠశాలలో బాలురకు 20, బాలికలకు 20 సీట్ల చొప్పున 120 మంది విద్యార్థులకు అవకాశం లభించనుంది. ఈ నెల 15న దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. 18, 19వ తేదీల్లో మండల స్థాయిలో విద్యార్థుల ఎంపిక జరుగనున్నది. అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను 25వ తేదీన జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు. అందులో ఉత్తీర్ణులైన వారు హకీంపేట్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఎంపికలకు హాజరవుతారు. ఇక్కడ వచ్చేనెల 1 నుంచి 5వ తేదీ వరకు ఎంపికలు నిర్వహిస్తారు. ఇక్కడ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాలల్లో ప్రవేశం కల్పిస్తారు.

క్రీడా పాఠశాలల్లో ఉజ్వల భవిష్యత్తు



క్రీడా పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు క్రీడల్లో ఉత్తమ శిక్షణ లభిస్తుంది. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పాటు అందుతుంది. గతంలో దరఖాస్తు చేసుకోని వారు ఆయా మండలాల ఎంఈవోలను కలిసి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- సుధీర్ కుమార్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి

విద్యార్థుల ఎంపిక ఇలా..

క్రీడా పాఠశాలల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పలు రకాల పరీక్షలు నిర్వహిస్తారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల పరుగు, 6/10 మీటర్ల షటిల్‌రన్, మెడిసిన్ బాల్‌త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, ఎత్తు, బరువు కొలతలు నిర్వహిస్తారు. వాటి ద్వారా విద్యార్థి క్రీడా, శారీరక సామర్థ్యాన్ని పరిశీలిస్తున్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

- ఎన్‌హెచ్‌పీఎస్ జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్

గద్వాల టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సీడ్ పత్తి రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి (ఎన్‌హెచ్‌పీఎస్) జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. విత్తన ఉత్పత్తి రైతులకు పాస్, ఫెయిల్‌తో సంబంధం లేకుండా కంపెనీలు సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పోరాట సమితి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కొంత మంది రైతుల విత్తనాలు ఫెయిల్ అయినట్లు ఆర్గనైజర్లు చెప్తున్నందున రైతులందరూ జర్మినేషన్ టెస్టుకు సంబంధించిన రశీదు, లాట్ నంబరు, రైతు పేరు, చిరునామా సహా పూర్తి వివరాలు తమకు అందించాలని సూచించారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి సీడ్‌పత్తి రైతుల స్థితిగతులు, కంపెనీలు, ఆర్గనైజర్లు కుమ్మక్కై చేస్తున్న మోసాలను వివరించామన్నారు. అందుకు సానుకూలంగా స్పందించిన చైర్మన్ రైతులకు న్యాయం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేసినట్లు తెలిపారు. ఆ వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తామని, అనంతరం రైతుల పక్షాన పోరాట ప్రణాళికను సిద్ధం చేసేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. ఒప్పంద వ్యవసాయం చేయాలనుకునే వారు జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దిగుబడి రాక రైతులకు నష్టం వచ్చినా, అగ్రిమెంట్ మేరకు పరిహారం చెల్లించాల్సిందేనని కమిషన్ స్పష్టం చేసిన విషయాన్ని రైతులకు వివరించారు. సమావేశంలో పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, కార్యదర్శి లవన్న, నాయకులు వెంకట్రాములు, గౌని శ్రీనివాస్ యాదవ్, ప్రేమ్‌రాజ్, చిన్నరాములు, లక్ష్మన్న పాల్గొన్నారు.

మహిళలతో గౌరవప్రదంగా మెలగాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజని



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి రజని

వనపర్తి లీగల్ కంట్రిబ్యూటర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు, మహిళలతో గౌరవప్రదంగా మెలగాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయ మూర్తి వి.రజని అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణ దేవరాయ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కళాశాల సిబ్బందికి చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... పని ప్రదేశాల్లో మహిళల రక్షణ కోసం కచ్చితంగా నలుగురితో కూడిన ఇంటర్నల్ కంప్లెంట్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. పని ప్రదేశాలలో లైంగికంగా వేధించబడిన మహిళలు ధైర్యంగా కార్యాలయంలో ఉన్న ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలో పిర్యాదు చేయవచ్చని సూచించారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జి.ఉత్త రయ్య, కళాశాల ప్రధానోపాధ్యాయులు బి.జగన్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చోరీలు చేస్తున్న ముగ్గురి అరెస్ట్

- 14 తులాల బంగారం,
- 24 తులాల వెండి వస్తువుల స్వాధీనం

వనస్థలిపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్థుడితోపాటు అతడికి సహకరిస్తున్న మరో ఇద్దరిని వనస్థలిపురం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. కమ్మగూడకు చెందిన గంప అనురాధ(42) తన ఇంటి సమీపంలోగల చాక్లెట్ కంపెనీలో పనిచేస్తూ జీవిస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా నార్లపూర్ మండలం రామ్‌నాయక్ తండాకు చెందిన పాత నేరస్థుడు మండ్ల శివ(32), ఉదావత్ బాష(33), గొగుల విజయ్(28) ఈనెల 9వ తేదీన అనురాధ ఇంట్లో 14 తులాల బంగారం, 24 తులాల వెండి వస్తువులను అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంతో నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి 14 తులాల బంగారం, 24 తులాల వెండి వస్తువులు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మండ్ల శివ 12 దొంగతనాల కేసుల్లో నిందితుడని ఇన్‌స్పెక్టర్ టి. మహేష్ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

వ్యవసాయ పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక శిక్షణ

బిజినేపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువ పట్టభద్రుల కోసం వ్యవసాయ అనుబంధ పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక శిక్షణను ఐసీఏఆర్, భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్‌లో ఈ నెల 30, జూలై 1 తేదీల్లో రెండు రోజుల పాటు వ్యవస్థాపక అభివృద్ధి శిక్షణ నిర్వహించనున్నట్లు సోమవారం ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త దివ్య తెలిపారు. ఈ శిక్షణలో సేంద్రియ, ప్రకృతి పద్ధతులను ప్రోత్సహించే దిశగా, మైక్రోబియల్ బయోపెస్టిసైడ్స్, బయోపాలిమర్, సాంకేతికతలు, ఆయిల్ ప్రాసెసింగ్ యూనిట్, భూసార పరీక్ష కేంద్రం, విత్తనోత్పత్తి వంటి యూనిట్ల స్థాపనకు అవసరమైన అంశాలను వివరించి వాటి స్థాపన అవసరమైన పెట్టుబడి రుణాలు, సబ్సిడీ పథకాలు తదితర వాటిపై నాబార్డు అధికారులు, ఏజీ హబ్ సీఈవో విజయ్ వివిధ రంగాల నిష్ణాతులతో అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కనీసం ఇంటర్మీడియేట్, డిగ్రీ పూర్తి చేసి 35 ఏళ్ల లోపు షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ యువత శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించనునట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న యువత పేరు నమోదు చేసుకోవడానికి 8247371710, 9398319106 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నిజాయతీ చాటుకున్న కండక్టర్

- ప్రయాణికురాలికి బ్యాగు అప్పగింత



కొల్లాపూర్ ఆర్టీసీ బస్టాండ్ మహిళకు బ్యాగును అందజేస్తున్న మహిళా కండక్టర్

కొల్లాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన బ్యాగును ప్రయాణికురాలికి అప్పగించి కండక్టర్ నిజాయితీ చాటుకున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్ద కొత్తపల్లి మండలంలోని యాపట్ల గ్రామానికి చెందిన కేశమ్మ సోమవారం హైదరాబాద్ నుంచి ఊరికి వచ్చేందుకు బస్సులో ఎక్కింది. బస్సు నాగర్‌కర్నూల్ బస్టాండ్‌కు చేరుకున్న తర్వాత, మూత్ర విసర్జన కోసం దిగింది. తిరిగి వచ్చే సరికి బస్సు వెళ్లిపోయింది. దీంతో ఆమె కొల్లాపూర్ డిపోకు బస్సు ఎక్కి కండక్టర్ సాయిగీతకు విషయం తెలిపింది. ఆమె హైదరాబాద్ బస్సు వివరాలను తెలుసుకొని, సిబ్బందికి విషయం చెప్పి బ్యాగ్‌ను తెప్పించింది. సాయంత్రం కొల్లాపూర్ బస్టాండ్‌లో కంట్రోలర్ మురళీగౌడ్ సమక్షంలో ప్రయాణికురాలు కేశమ్మకు అప్పగించారు. ఆ బ్యాగులో 52 తులాల వెండి ఆభరణాలు ఉన్నట్లు ఆమె తెలిపింది. కండక్టర్ సాయిగీత, డ్రైవర్ కృష్ణయ్యలకు కృతజ్ఞతలు తెలిపింది.

అమానవీయం

- తల్లిని బస్టాండ్‌లో వదిలేసిన కొడుకు



ఆత్మకూరు బస్టాండ్‌లో ఉన్న వృద్ధురాలు

ఆత్మకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కనిపెంచిన తల్లిని భారంగా భావించిన ఓ కొడుకు ఆమెను నిర్దాక్షిణ్యంగా బస్టాండ్‌లో వదిలేసి వెళ్లిపోయాడు. ఈ అమానవీయ సంఘటన వనపర్తి జిల్లా, ఆత్మకూరు పట్టణంలో జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి పట్టణం పీర్లగుట్ట కాలనీకి చెందిన పార్వతమ్మను మూడు రోజుల క్రితం కుమారుడు భాస్కర్ కొట్టాడు. దీంతో ఆమె పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విషయాన్ని చెప్పింది. పోలీసులు అతడిని పిలిచి మాట్లాడారు. ఎందుకు కొట్టావని నిలదీశారు. తల్లిని ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. వైద్యం చేయించేందుకు హైదరాబాద్‌కు తీసుకెళ్తానని తల్లికి చెప్పాడు. కానీ ఆత్మకూరు బస్టాండ్‌లో వదిలేసి వెళ్లిపోయాడు. ఆమె కాలికి గాయం కావడంతో కనీసం బస్సు ఎక్కి వెళ్లే పరిస్థితి కూడా లేదు.

క్రైం కార్నర్

మహిళ దారుణ హత్య


బోయ అనిత (ఫైల్)

గద్వాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ గద్వాల జిల్లా, కేటీదొడ్డి మండలం పాతపాలెం గ్రామంలో సోమవారం తెల్లవారు జామున ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. సంఘటనకు సంబంధించి కేటీదొడ్డి ఎస్‌ఐ శ్రీనివాసులు, గ్రామస్థుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోయ అనిత (26), ఆంజనేయులు దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. భర్త ఆంజనేయులు హైదరాబాద్‌లో ఉంటూ కూలి పనులు చేస్తున్నాడు. అప్పుడప్పుడు గ్రామానికి వచ్చి వెళ్తుంటాడు. ఇటీవల ఏరువాక పౌర్ణమి పండుగకు ఆయన వచ్చి వెళ్లాడు. ఇంట్లో ఇద్దరు పిల్లలతో ఉంటున్న ఆమె సోమవారం హత్యకు గురయ్యింది. మంగళవారం ఉదయం 9 నెలల చంటిపాప, నాలుగేళ్ల బాబు ఆమె మీద పడి ఏడుస్తుండగా పక్కింటి వారు వెళ్లి చూశారు. అప్పటికే ఆమె చనిపోయి ఉంది. మెడ చుట్టూ ఉరి వేసినట్లు ఆనవాళ్లు ఉండటంతో సమీపంలో ఉండే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. డాగ్‌స్కాడ్ బృందం వచ్చి చూడగా, కుక్కలు గ్రామంలో అక్కడక్కడ ఆగుతూ.. ఊరి బయటకు చేరుకున్నాయి. అక్కడ ఎవరో మద్యం తాగిన ఆనవాళ్లు కనిపించాయి. ఆమెకు ఎవరితో నైనా వివాదాలున్నాయని అని పోలీసులు ఆరా తీయగా, రెండు నెలల క్రితం ఇంటి దగ్గర వాళ్లతో గొడవ జరిగిందని, ఆమె వారిపై కేసు పెట్టిందని తెలిసింది. మృతదేహాన్ని గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. సోదరుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

3 వేర్వేరు కేసుల్లో ముగ్గురికి జైలు శిక్ష

మహబూబ్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వేర్వేరు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారులు తీర్పు వెల్లడించారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2024లో నమోదైన అసభ్య చిత్రాల ప్రదర్శన, దౌర్జన్యం సంఘటనపై నవాబ్‌పేట మండలంలోని కామారం గ్రామానికి చెందిన చిలుకల కృష్ణయ్యపై కేసు నమోదైంది. నేరం రుజువు కావడంతో అతడికి 8 నెలల కారాగార శిక్ష విధిస్తూ మూడవ అదనపు జేఎఫ్‌సీఎం, ప్రత్యేక మొబైల్ కోర్టు న్యాయాధికారి మహ్మద్ మునావర్ హుస్సేన్ తీర్పు ఇచ్చారు. గండీడ్ మండలంలోని కొండాపూర్‌కు చెందిన గొల్లకృష్ణయ్యపై 2022లో లైంగిక వేధింపుల కేసు నమోదైంది. అతడికి 3 సంవత్సరాల జైలుశిక్ష, రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. మరో కేసులో మిడ్జిల్ మండలం, రాణిపేటకు చెందిన కర్నెకోట నిరంజన్‌కు సంవత్సరం జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి నిహారిక తీర్పు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి మాట్లాడుతూ పోలీసులు కేసులను ఛేదించి, సరైన సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించడంతో దోషులకు శిక్ష పడిందని తెలిపారు. వారి కృషిని అభినందించారు.

దంపతులపై దొంగల దాడి

కొత్తకోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : దంపతులపై దొంగలు రాళ్లతో దాడి చేసి పారిపోయారు. ఈ సంఘటన వనపర్తి జిల్లా, కొత్తకోట మండలంలోని అమడబాకుల గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్డె శంకర్ ఇంటి ముందు కమ్మిన కోళ్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో కోళ్లు అరవడంతో వడ్డె శంకర్, భార్య శిరీశ బయటకు వచ్చి వారిని అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో దొంగలు వారిపై రాళ్లతో దాడి చేసి పరారయ్యారు. వారు 100 నెంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకున్నారు. దొంగల కోసం పరిసరాల్లో గాలించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

రెండు స్కూల్ బస్సులు సీజ్


పెబ్బేరులోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సును సీజ్ చేసిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు

పెబ్బేరు రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సరైన అనుమతులు, ఫిట్‌నెస్ లేని రెండు పాఠశాల బస్సులను సోమవారం సీజ్ చేశారు. మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు మూడు బస్సులను తనిఖీ చేశారు. అందులో పెబ్బేరు పట్టణంలోని గాంధీ మెమోరియల్ స్కూల్, మాంటిస్సోరి ప్లే స్కూల్ బస్సులకు సరైన అనుమతి పత్రాలు లేవు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మంది విద్యార్థులను ఎక్కించుకున్నారు. దీంతో వాటిని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతీ స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. లేకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

లైంగిక వేధింపుల కేసులో..

మాజీ సర్పంచ్‌కు జైలుశిక్ష

మిడ్జిల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : లైంగిక వేధింపుల కేసులో ఓ మాజీ సర్పంచులు జైలు శిక్ష పడింది. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలోని రాణిపేట మాజీ సర్పంచ్ నిరంజన్ 2020లో పదవిలో ఉన్నప్పుడు లైంగిక వేధింపుల కేసు నమోదయ్యింది. అప్పటి ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేపట్టారు. సోమవారం నిరంజన్‌ను జడ్చర్ల కోర్టులో ప్రవేశపెట్టారు. అతడిపై నేరం రుజువు కావడంతో సంవత్సరం జైలు శిక్షతో పాటు, రూ. 5 వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి జుత్తూరు నిహారిక తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ రమేశ్ తెలిపారు.

కేఎల్ఐ కాల్వలో పడి వ్యక్తి మృతి

మిడ్జిల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండల కేంద్రానికి చెందిన వస్పరి నాగయ్య (32) కొత్తూరు రోడ్డులోని కేఎల్ఐ కాల్వలో పడి మృతి చెందాడు. ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేఎల్ఐ కాల్వలో గుర్తు తెలియని మృత దేహం ఉన్నట్లు సోమవారం సమాచారం రావడంతో పోలీసులు వెళ్లి చూశారు. స్థానికుల సమాచారం మేరకు అతడు మిడ్జిల్ గ్రామానికి చెందిన నాగయ్యగా గుర్తించారు. అతడు ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో కాల్వ వద్ద ఉన్న బోరు మోటరును ఆఫ్ చేసి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అతడికి మూర్ఛవ్యాధి ఉండటంతో కాలువలో పడిపోయినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు భార్య సరోజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో పడి యువకుడు..

బాలానగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండలంలోని వీరన్నపల్లి తండాలో ఈ సంఘటన జరిగింది. ఏఎస్‌ఐ సుజ్ఞానం కథనం మేరకు.. తండాకు చెందిన కేతావత్ రవి (22) ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అ తడు కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. ఈ నెల 13న మద్యం తాగడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో ఆయన బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం అతడి మృతదేహం చెరువులో కనిపించడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.


శిథిలస్థితిలో మెన్నిపాడు పాఠశాల భవనం


ఖిల్లాఘణపూర్ రోడ్డు మీద తండా ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మురుగునీరు

సర్కార్ బడి.. సమస్యల ఒడి

- శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాలలు
- వంట గదులు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు
- అద్దె భవనాల్లో విద్యార్థుల అవస్థలు
- ఉపాధ్యాయుల కొరతతో ఇక్కట్లు

ఆంధ్రజ్యోతి విజిట్


పాలమూరు పట్టణంలోని బీపీహెచ్ఎస్ ఆవరణలో నిలిచిన వర్షం నీరు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ గద్వాల సర్కిల్ / అలంపూర్ చౌరస్తా/ నారాయణపేట/ కల్వకుర్తి/ పెద్దకొత్తపల్లి/ బిజినేపల్లి/ వనపర్తి విద్యా విభాగం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యాసంవత్సరం ఈనెల 12న ప్రారంభమయ్యింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తెరుచుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. తరగతులు కూడా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించింది. సమస్యలను తెలుసుకున్నది. కొన్ని పాఠశాలలకు సొంత భవనాలు లేవు. ఉపాధ్యాయుల కొరత కొనసాగు తోంది. వంట గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ఉన్నా నిర్వహణ సక్రమంగా లేక నిరుపయోగంగా ఉన్నాయి. అద్దె భవనాల్లో ఇరుకు గదులతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెల్లడైన వివరాలిలా ఉన్నాయి.

● భూత్పూర్ మండలం భట్టుపల్లిలోని ప్రాథమిక పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతోంది. అసంపూర్తిగా ఆ భవనంలో పిల్లర్ల మధ్య, రేకుల గదిలో పాఠశాలను నిర్వహిస్తున్నారు.

● మహమ్మదాబాద్ మండలం బొట్లగడ్డ తండా పాఠశాలలో 10 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ఇక్కడి ఉపా..ధ్యాయులు గత ఏడాది జరిగి న బదిలీల్లో వేరే పాఠశాలలకు వెళ్లిపోయారు. దీం తో విద్యాబోధన సాగడం లేదు.

● మహమ్మదాబాద్ మండలం బోరింగ్ తండా పాఠశాల నాలుగేళ్లుగా మూతపడి ఉంది. ఇటీవల పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించినా, డిప్యూటేషన్‌పై మరో పాఠశాలకు వెళ్లారు. దాంతో పాఠశాల మళ్లీ మూతపడింది. ఈ ఏడాది టీచర్‌ను ఏర్పాటు చేస్తామని ఎంఈవో రాజునాయక్ తెలిపారు.

● నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉర్దూమీడియం పాఠశాల శిథిలావస్థలో ఉన్న అద్దె భవనంలో కొనసాగుతోంది. చిన్న వర్షం వచ్చినా తరగతి గదుల్లోకి నీరుస్తోంది. ఐదు తరగ తులు ఉన్న ఈ పాఠశాలలో 18 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఉన్న రెండు ఇరుకు గదుల్లో ఒకవైపు విద్యాబోధన, మరో వైపు మధ్యాహ్న భోజనం వంటలు చేయాల్సి వస్తోంది.

● నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ మండల ప్రజా పరిషత్ (దళిత వాడ) పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుతం ఎస్సీ కమ్యూనిటీ హాల్లో కొనసాగిస్తున్నారు. 32 మంది విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామని ప్రధానోపాధ్యాయిని బాలమణి తెలిపారు.

● పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని బాచారం గ్రామంలో దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకున్నది. ఉన్న రెండు గదుల్లో ఒక దానికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మరో గది పూర్తిగా శిథిలం అయ్యింది.

● బిజినేపల్లి మండలం, పాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం పూర్తిగా శిథిలమైంది. పలుమార్లు ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు.

● మండలంలోని గ్రూప్లోతండా, కల్వకుంట్ల తండా, అంజనాద్రినగర్, పాలెం ఉర్దూ మీడియం పాఠశాలల్లో విద్యార్థులు లేక మూత పడ్డాయి.

● వనపర్తి జిల్లా, అమరచింత మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులుండగా, 4 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. అవి కూడా అపరిశుభ్రంగా, అస్తవ్యస్తంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

● ఖిల్లాఘణపురం మండలంలోని గిరిజన తండాల పాఠశాలల్లో తాగు నీటి సమస్య నెలకొన్నది. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు అవస్థ పడుతున్నారు. స్కావెంజర్లు లేకపోవడంతో పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. రోడ్డుమీది తండాలోని ప్రభుత్వ పాఠశాలలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

● గద్వాల మునిసిపాలిటీ పరిధిలోని గంజిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిథిలమైంది. పలుమార్లు పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. దీంతో పాఠశాలను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి తరలించారు. అక్కడ ఒక్క గదిలోనే 5 తరగతులు కొనసాగుతున్నాయి. నూతన భవనం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినా, ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు.

● పెద్ద అగ్రహారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కూడా శిథిలావస్థకు చేరింది. వర్షం పడితే తరగతి గదుల పైకప్పులోంచి నీరు వస్తోంది. వంట గది లేదు.

● జిల్లాలోని చాలా పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పథకం (నాటి మన ఊరు-మన బడి పథకం) కింద చేపట్టిన పనుల తాలూకు బిల్లులు గుత్తేదారులకు అందకపోవడంతో పనులను మధ్యలోనే నిలిపి వేశారు. బిల్లులు చెల్లిస్తే తప్ప పనులు ముందుకు సాగే పరిస్థితి లేదు.

● ఉండవల్లి మండల పరిధిలోని మెన్నిపాడు ప్రాథమిక పాఠశాలలో గతేడాది వరకు 48 మంది విద్యార్థులున్నారు. బడిలో 5 తరగతి గదులుండగా, అందులో మూడు గదులు వర్షం వస్తే కురుస్తున్నాయి. దీంతో వానాకాలం తరగతులు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. బడిలో మూత్రశాలలు, మరుగుదొడ్లు కూలిపోయాయి.

● నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉర్దూమీడియం పాఠశాల శిథిలావస్థలో ఉన్న అద్దె భవనంలో కొనసాగుతోంది. చిన్న వర్షం వచ్చినా తరగతి గదుల్లోకి నీరుస్తోంది. ఐదు తరగతులు ఉన్న ఈ పాఠశాలలో 18 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

అబ్దుల్ ఘని, ఇన్‌చార్జి డీఈవో, జోగులాంబ గద్వాల : త్వరలోనే పెండింగ్ పనులను పూర్తి చేయిస్తాం. శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాలను పరిశీలిస్తాం. సమస్య పరిష్కారానికి కలెక్టర్ పర్యవేక్షణలో చర్యలు తీసుకుంటాం.


శిథిలావస్థకు చేరిన ఎంపీపీఎస్ హెచ్‌డబ్ల్యూ పాఠశాల భవనం


పేట బాలికల పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

జగద్గురువుల రాకతో పాలమూరు పావనం


జగద్గురువులకు స్వాగతం పలుకుతున్న స్థానికులు


మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ
- భక్తిశ్రద్ధలతో యుగమానోత్సవం
- వందలాదిగా తరలి వచ్చిన భక్తులు

భూత్పూర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : జగద్గురువుల రాకతో పాలమూరు పావనమైందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మునిసిపాలిటీ కేంద్రంలోని వాసవీ కల్యాణ మండపంలో సోమవారం పంచాచార్య యుగమానోత్సవం, మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వీరశైవ సమాజం జిల్లా, మండల అధ్యక్షుడు ముక్త శ్రీశైలం, నాగరాజుల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జగద్గురువులు ఉజ్జయిని సద్ధర్మ సింహా సనాధీశ్వర సిద్ధలింగ శివాచార్యులు, శ్రీశైల సూర్య సింహాసనాధీశ్వర సిద్ధరామ పండితారాధ్య శివాచార్యులు, కాశీజ్ఞాన సింహాస నాధీశ్వర చంద్రశేఖర శివాచార్యులు, మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య మహాస్వాములు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఎంపీ డీకే అరుణ, పాలమూరు ఎమ్మెల్యే యన్నెం శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వివిధ పీఠాల అధిపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ ప్రతీ మనిషి ధర్మ సంరక్షణ కోసం పాటు పడాలన్నారు. హిందు ధర్మ సంస్థాపనకు కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం జగద్గురువులు భక్తులనుద్దేశించి మాట్లాడారు. పాలమూరు జిల్లాకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. దేవుడు ఎక్కడో లేడని, మంచి మనసున్న ప్రతీ ఒక్కరిలో కొలువై ఉన్నాడని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవరచుకోవాలని సూచించారు. ఇస్లాం మతానికి ఉన్నట్లుగానే వీరశైవ లింగాయత్‌లకు కూడా 856 అనే సంఖ్య ఉందని శ్రీశైల సూర్య సింహాసనాధీశ్వర శివాచార్య మహాస్వామి భక్తులకు తెలిపారు.

ఈ నెల 20న ఇంటర్నేషనల్ వెబినార్

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్


వెబినార్ బ్రౌచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'కాన్షియస్ లివింగ్' అంశంపై ఈ నెల 20న ఇంటర్నేషనల్ వెబినార్ నిర్వహించనున్నట్లుపాఆలమూరు యూనివర్సిటీ వీసీ జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెబినార్ బ్రోచర్‌ను సోమవారం యూనివర్సిటీ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెబినార్ కీనోట్ స్పీకర్‌గా ఆస్ట్రేలియా నుంచి ప్రొఫెసర్ సరోజ గుల్లపల్లి హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోకన్వీనర్లు డాక్టర్ రవికుమార్, డాక్టర్ అర్జున్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

భూత్పూర్/ జడ్చర్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్, జడ్చర్ల మండలాల్లో ఇద్దరు ఇద్దరు అదృశ్యం అయ్యారు. భూత్పూర్ ఎస్‌ఐ చంద్రశేఖర్, జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భూత్పూర్ మండలంలోని కర్వెన గ్రామానికి చెందిన బర్రెల కృష్ణవేణి (34) ఈ నెల 14న ఆసుపత్రికి వెళ్లి వస్తానని ఇంట్లో వారికి చెప్పి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో భర్త భీమయ్య, అదే గ్రామానికి చెందిన బావమరిది తిరుపతి ఇద్దరూ కలిసి బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

- జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ ప్రాంతానికి చెందిన మంగలి సంతోష్‌కుమార్ ఆదివారం ఉదయం 6 గంటలకు లక్ష్మీనగర్‌కాలనీలోని తన సెలూన్‌కు వెళ్లాడు. మధ్యాహ్నం భోజనానికి రాకపోవడంతో భార్య సంధ్య సెలూన్ వద్దకు వెళ్లింది. కానీ ఆయన అక్కడ కనిపించలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ మెసేజ్ వచ్చింది. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికింది. కానీ ఆచూకీ లభించకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి కృషి

- రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్
- కొండారెడ్డిపల్లి, చారకొండ ప్రభుత్వ పాఠశాలల తనిఖీ
- తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి స్థల పరిశీలన


చారకొండ ప్రభుత్వ పాఠశాలలో రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్

వంగూరు/ చారకొండ, జూన్ 16; (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి కృషి చేస్తోందని విద్యా కమిషన్ రాష్ట్ర సభ్యుడు చారకొండ వెంకటేశ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి, చారకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం మేరకు కొండారెడ్డిపల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి స్థల పరిశీలించి, ఉపాధ్యాయులతో చర్చించారు. అనంతరం చారకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో తెలుగు, ఆంగ్లం పాఠ్యాంశాలను చదివించి సామర్థ్యాలను తెలుసుకున్నారు. జీహెచ్ఎం భగవాన్‌రెడ్డితో మాట్లాడి విద్యార్థుల సంఖ్య, వసతుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యబోధన చేయాలని సూచించారు. పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఆర్‌వో ప్లాంట్, క్రీడా మైదానం, ముత్రశాలలు, మరుగుదొడ్లు తదితర పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. వంగూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చారకొండ, రంగాపూర్ గ్రామాల్లోనూ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రికి నివేదిక అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో వంగూరు మాజీ ఉప సర్పంచ్ వేమారెడ్డి, పులిజాల కృష్ణారెడ్డి, హెచ్ఎం మురళీధర్‌రెడ్డి, పీఏసీ ఎస్ చైర్మన్ గురువయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ స్వరూప రాణి, మెడికల్ ఆఫీసర్



మల్దకల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూప రాణి అన్నారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు.

వర్షాకాలంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

వానాకాలంలో ఇళ్లల్లో నీరు ఎక్కువ నిల్వ ఉంచరాదు. నిల్వ ఉంచితే డెంగీ, మలేరియా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్‌బాల్స్ వేసి దోమ లార్వాను నశింపజేయాలి. ఇళ్లలో ఉన్న పూలకుండీలు, నీటి డ్రమ్ములు, పాత టైర్లలో నీరు నిల్వ ఉంటే వెంటనే తొలగించాలి.

ప్రతీ నెల పీహెచ్‌సీలో ఎన్ని కాన్పులు అవుతున్నాయి?

మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రతీ నెల 25నుంచి 30వరకు సాధారణ కాన్పులు అవుతున్నాయి. అలాగే వంద మంది వరకు సాధారణ రోగులు వస్తారు. సిబ్బంది వైద్య పరీక్షలు చేస్తారు.

పల్లె దవాఖానాలు, సబ్ సెంటర్లు ఎన్ని ఉన్నాయి?

మండలం మొత్తంగా నాలుగు పల్లె దవాఖానాలు, ఏడు సబ్‌సెంటర్లు ఉన్నాయి.

పీహెచ్‌సీలో సిబ్బంది ఎందరున్నారు?

పీహెచ్‌సీలో ఒక మెడికల్ ఆఫీసర్, ఒక హోమియోపతి మెడికల్ ఆఫీసర్, 15మంది ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సు, 52మంది ఆశా కార్యకర్తలు, ఒక ఫార్మసిస్టు, అటెండర్ స్టాఫ్ పని చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

గద్వాల క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో సోమవారం మీనాక్షి లాడ్జి యజమాని ప్రదీప్ సాగర్ గ్రూప్ 1, 2 ప్రిపేర్ అయ్యేవిద్యార్థులకు వారికి కావలసిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ హాజరయ్యారు. గ్రూప్స్ ప్రిపేర్ అయ్యే పేద విద్యార్థులకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ప్రదీప్‌సాగర్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం ఉన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

● రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక

వడ్డేపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రజకుల సంక్షేమం కోసం అసెంబ్లీలో 2016 డిసెంబరు 26న ఎస్సీ జాబితాలో చేర్చాలని అప్పటి కొడంగల్ ఎమ్మెల్యే హోదాలో మాట్లాడిన రేవంత్ రెడ్డి తక్షణమే సమస్యను ముఖ్యమంత్రి హోదాలో పరిష్కరించాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక అన్నారు. సోమవారం శాంతినగర్‌లో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు సి.వెంకటేష్, మండల అధ్యక్షుడ బందెన్న అధ్యక్షన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యద ర్శి రాజగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి శేఖర్, ఉపాధ్యక్షుడు రామారావు, ప్రచార కార్యదర్శి రాఘవేంద్ర, మాజీ అధ్యక్షుడు మద్దిలేటి, తిప్పన్న, వెంకట్రాములు, రామకృష్ణ, నర్సింహులు, భీమన్న, దేవన్న, శ్రీను, వెంకటేష్, రాంబాబు, మల్లేష్, బాల్‌రాజ్, జయన్న, దస్తగిరి, పరశురాములు, ముని, రాజన్న, లక్ష్మణ్, భీములు, గోపాల్ ఉన్నారు.

వ్యక్తిగత శుభ్రతతోనే వ్యాధులు దూరం

ఉండవల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా డయేరియా, ఇతర వ్యాధులను నివారించవచ్చని హెల్త్‌అసిస్టెంట్ నాగేశయ్య అన్నారు. సోమవారం ఉండవల్లి మండలంలోని తక్షశిల జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు డయేరియా నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం అనిత బాయి, ఆశ కార్యకర్త చిన్నమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

మానవపాడు కేజీబీవీలో ఖాళీలు

మానవపాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యాభ్యాసం పొందేందుకు తరగతుల వారీగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ఎస్‌వో జ్యోతి తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థినుల కోసం 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ 40సీట్లు, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు.

పైపాడు.. సమస్యల గూడు



రెండవ వార్డులో సక్రమంగా లేని డ్రైనేజీ



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు

● మట్టిరోడ్లన్నీ బురదమయం

● పాముకాట్లకు గురవుతున్న కాలనీవాసులు

ఆంధ్రజ్యోతి వార్డ్ వాచ్

వడ్డేపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ గ్రామం పైపాడు రెండోవార్డులో సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. సీసీరోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకపక్క సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించి, మరో పక్క నిర్మించకపోవడంతో ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. ఎన్నికల సమయంలో కల్లబొల్లి మాటలు చెప్పి, ఆ తర్వాత గ్రామం అభివృద్ధి గురించి పట్టించుకోవడం ప్రజలు చెబుతున్నారు. కాలనీలోని మట్టి రోడ్లు వర్షం కురిస్తే బురదమయంగా మారుతున్నాయి. ఉన్నటువంటి మట్టిరోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి విషసర్పాలు సంచరిస్తుండటంతో ప్రజలు పాముకాట్లకు గురవుతున్నారు. దీనివల్ల ఇప్పటికే ఐదుగురు మృతి చెందారని కాలనీవాసులు తెలిపారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండకపోవడం అవస్థలు పడుతున్నారు. అలాగే దోమల నివారణకు మందులు పిచికారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. మునిసిపాలిటీ ఏర్పడినా సమస్యలు మాత్రం కొన్నేళ్లుగా ఎక్కడిక్కడే తిష్ట వేశాయని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

చినుకు పడితే చీకటే..



వానాకాలంలో చినుకుపడితే చీకట్లో మగ్గిపోతున్నాం. వడ్డేపల్లి, శాంతినగర్‌లో కరెంటు ఉండి పైపాడులో మాత్రం ఉండదు. ఈ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు, మునిసిపల్ చైర్‌పర్సన్‌లకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. ఏళ్ల తరబడి వర్షాకాలంలో నరకం అనుభవిస్తున్నాము.

- వెంకటేశ్, కాలనీవాసి

దోమలతో అల్లాడిపోతున్నాం



ఇటీవల కురుస్తున్న వర్షాలకు దోమలతో నానాఅవస్థలు పడుతున్నాం. అధికారులు దోమలనివారణకు మందు పిచికారీ చేయలేదు. కాలనీలో కొంతవరకే సీసీరోడ్లు వేశారు. మితగా వార్డుల్లోనూ వేసి ఇబ్బందులు పరిష్కరించాలి. రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఉండటంతో విషసర్పాలు ఇళ్లలోకి వస్తున్నారు.

- తిక్కయ్య, కాలనీవాసి

రోడ్లన్నీ బురదమయం



వర్షాకాలంలో కాలనీల్లో మట్టి రోడ్లన్నీ బురదమయమై నడవడానికి ఇబ్బందికరంగా ఉంటుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నాయకులు నెరవేర్చడం లేదు. సీసీరోడ్లు నిర్మించకపోవడంతో ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి విషసర్పాలు తిరుగుతున్నాయి. ఏళ్లుగా భయంభయంగా గడుపుతున్నాము. అధికారులు స్పందించాలి.

- శంకరమ్మ, కాలనీవాసి

భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

» కలెక్టరేట్‌లో గొర్లఖాన్‌దొడ్డి గ్రామస్థులు, కార్యదర్శి నిరసన

గద్వాల న్యూటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గట్టు మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి గ్రామంలో సర్వే. నెం. 83,84, 213 గల శిఖం భూమికి సంబంధించి 23 ఎకరాల భూమిని గట్టు మండల కేంద్రానికి చెందిన కొందరు ఆక్రమించారని, వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గొర్లఖాన్ దొడ్డిలో 23 ఎకరాల భూమిలో క్రిమిటోరియం, సెగ్రిగేషన్‌షెడ్, గ్రామ తాగునీటి బోరు కూడా ఉన్నాయన్నారు. ఈ భూమిని అప్పటి కలెక్టర్ రజత్‌కుమార్ షైనీ ఆదేశాలతో శ్మశానానికి తహసీల్దార్ ప్రొసీడింగ్ కూడా ఇచ్చారన్నారు. కానీ గట్టుకు చెందిన గుండన్న, పెద్ద మూకన్న, కృష్ణ, చిన్నమూకన్న, వెంకటన్న దౌర్జన్యంగా ఆక్రమించి ఈ భూమిని సాగు చేశారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ముంపు భూముల పరిహారం ఇప్పించాలి

గట్టు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చిన్నోనిపల్లి రాజర్వాయర్‌లో ముంపునకు గురైన ప్రభుత్వ భూములకు పరిహారం ఇప్పించాలంటూ పలువురు రైతులు సోమవారం చాగదోణలో జరిగిన భూభారతి రైతు సదస్సులో తహసీల్దార్ మదన్ మోహన్‌గౌడుకు వినతిపత్రం అందచేశారు. సర్వే నంబర్ 421, 437, 449, 442 లోని ప్రభుత్వ భూములు ముంపునకు గురయ్యాయని, పరిహారం రాకముందే మా భూములు తొలగించారని తెలిపారు. దీంతో తాము రైతుబంధు, బ్యాంకు రుణాలు రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' వీక్షించిన రైతులు

అలంపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో అలంపూరు మండలంలోని క్యాతూరు, బుక్కాపూరు, లింగనవాయి గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. లింగనవాయిలో రైతునేస్తం కార్యక్రమానికి తహసీల్దార్ మంజుల పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, జూనియర్ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.

● ఇటిక్యాల: ఇటిక్యాలలో రైతు నేస్తం కార్యక్రమము నిర్వహించారు. సోమవారం తహసీల్దార్ వీరభద్రప్ప, మండల వ్యవసాయాధికారి రవికుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు నేస్తం కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్యక్రమాన్ని ఇటిక్యాల మండలంలోని చాగపురం, వేముల, ధర్మవరం, పుటాన్‌దొడ్డి రైతువేదికలో ఏర్పాటు చేసిన టీవీలలో రైతులు వీక్షించారు.

● **పది మంది రైతులు కూడా హాజరుకాలే..**

మానవపాడు : మానవపాడులోని రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతునేస్తం కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టుమని పది మంది రైతులు కూడా హాజరుకాలేదు. అధికారుల నిర్లక్ష్యం వల్లే సమాచారం లేక రైతులు హాజరుకావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌జ్యోషి హాజరై, ఇతర గ్రామంలో పనులు ఉన్నాయని వెళ్లిపోయారు. ఏఎస్ఐ, కానిస్టేబుల్ భద్రత ఏర్పాటు చేశారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

● సీపీఐ-ఎంఎల్ జిల్లా కార్యదర్శి కార్తీక్

● మహాధర్నా పోస్టర్ విడుదల

గద్వాల టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో సాగుతున్న హత్యాకాండను వెంటనే నిలిపివేయాలని సీపీఐ-ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ కోరారు. కాల్పుల విరమణ పాటించి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని, తద్వారా మారణకాండకు స్వస్తి పలకాలన్నారు. ఇదే లక్ష్యంతో ఈనెల 17న హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నచౌక్ వద్ద తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ధర్నా పోస్టర్‌ను సోమవారం పట్టణంలోని కృష్ణవేణి చౌరస్తాలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కార్తీక్, శాంతిచర్చలకు మావోయిస్టులు సిద్ధమని స్పష్టంగా ప్రభుత్వానికి తెలిపినా పట్టించుకోకుండా పార్టీ ప్రధాన కార్యదర్శితో సహా కీలకమైన 28 మంది నాయకులను అంతం చేసిన రెండు రోజులకే దండకారణ్యంలోని అత్యంత విలువైన ఖనిజ సందపగల 2,057 ఎకరాల భూమిని ప్రైవేటు కంపెనీకి అప్పగించడమేగాక, 23వేల చెట్లను నరికి వేసేందుకు కేంద్ర పర్యావరణ శాఖ అనుమతించడం వెనుక భారీ కుట్ర ఉందన్నారు. రాజ్యాంగ బద్ధంగా ఆదివాసీలకు దక్కిన హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం గడచిన ఏడాది కాలంగా సాగిస్తున్న మారణహోమంలో450 మంది మృత్యువాత పడగా అందులో మూడువంతులకు పైగా ఆదివాసీలే ఉన్నారన్నారు. ప్రభుత్వ పాసిస్టు విధానాన్ని ఎండగట్టేందుకు తలపెట్టిన మహాధర్నాకు మేధావులు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో టీపీఎఫ్, తెలంగాణ రైతాంగ సమితి తదితర సంఘాల నాయకులు గోపాల్‌యాదవ్, నాగన్న, కోళ్ల ఆంజి, ప్రవీణ్, ప్రేరాజ్, పవన్ ఉన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

» అయిజ రెవెన్యూ సదస్సులో అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప

అయిజ / ధరూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప అన్నారు. సోమవారం అయిజ పట్టణంలోని రైతువేదికలో తహసీల్దార్ జ్యోతి సమక్షంలో రైతుసదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సదస్సులో 58 దరఖాస్తులు రైతుల నుంచి అందాయని తహసీల్దార్ జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జనార్దన్ ఉన్నారు.

● ధరూరు : భూసంబంధిత సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టి భూభారతి చట్టంలో భాగంగా నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ అలివేలు మంగ సూచించారు. సోమవారం ధరూరు మండల పరిధిలోని రేవులపల్లి, బూరెడ్డిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో భాగంగా రైతుల నుంచి భూ సమస్యలపై 13 దరఖాస్తులను స్వీకరించామన్నారు.

వీటిని ఆన్‌లైన్ నమోదు చేసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామాలపరిధిలో నిర్వహించే సదస్సులు సంబంధిత అధకారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాఘవేంద్ర, తిరుమలేష్, కంప్యూటర్ ఆపరేటర్ శేఖర్ ఉన్నారు.

త్రిఫ్ట్ ఫండ్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నేత కార్మికుల కోసం పొదుపు పథకం (త్రిఫ్ట్ ఫండ్)ను పునఃప్రారంభించినందున మగ్గాలు, వాటి అనుబంధ కార్మికుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చేనేత జౌళిశాఖ జిల్లా సహాయ సంచాలకులు గోవిందయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈనెల 19లోగా కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

విదేశీ విద్య పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

గద్వాలసర్కిల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): 2025 విద్యా సంవత్సరానికి మైనార్టీ సంక్షేమ శాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశానుసారం విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే జిల్లాలోని మైనార్టీ విద్యార్థులకు ముఖ్యమంత్రి విదేశీ విద్యాపథకం (సీఎం ఓవరీస్ స్కాలర్‌షిప్ స్కీం) కింద దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీస్ సంక్షేమశాఖాధికారి రమేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్ డిగ్రీలో 60శాతం మార్కులతో ఉత్తీర్ణులై పీజీ అభ్యసించదలచిన అభ్యర్థులు, పీజీలో 60శాతం మార్కులతో ఉత్తీర్ణులై పీహెచ్‌డీ (డాక్టరేట్) చేయాలనుకునే విద్యార్థులు, స్ప్రింగ్ సీజన్ -2025 (1 జనవరి, 2025 నుంచి జూన్ 30వరకు) ఎంపిక చేయబడిన విదేశీ యూనివర్శిటీలో అడ్మిషన్ పొంది ఉన్న విద్యార్థులు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు.

ఆసక్తి గల మైనార్టీలు(ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, పార్శీలు) ఈనెల 30లోగా ప్రభుత్వ వెబ్‌సైట్ (తెలంగాణ ఈ పాస్)లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తులను జులై 31వ తేదీలోగా కలెక్టరేట్‌లో మైనార్టీస్ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.

సివిల్ సర్వీస్ పరీక్షకు ఉచిత కోచింగ్

గద్వాల టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ హైదరాబాద్‌లో సివిల్ సర్వీసెస్-2026 అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందజేస్తుందని స్టడీ సర్కిల్ గద్వాల కేంద్రం ఇన్‌చార్జి కె.రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు జూలై 8వ తేదీలోగా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుదారుల్లో రిజర్వేషన్ ఆధారంగా వంద మందిని ఎంపిక చేస్తారని, ఎంపికైన వారికి భోజనం వసతితో పాటు రవాణా ఖర్చుల నిమిత్తం నెలకు రూ.5వేలు స్టైఫండ్‌గా అందజేస్తారని తెలిపారు. అభ్యర్థులకు లైబ్రరీ వసతి ఉంటుందని, దరఖాస్తుదారులకు జూలై 12న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.

భూసమస్యలపై 73 దరఖాస్తులు

మానవపాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రైతు భూముల సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ తెలిపారు. సోమవారం మండలంలోని నారాయణపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూభారతి చట్టంపై గ్రామ రైతులకు అవగాహన కల్పించారు.

వివిధ భూ సమస్యలపై 73 దరఖాస్తులు అందాయని అధికారులు వెల్లడించారు. వాటిని పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీటీ కరుణాకర్, ఆర్ఐ గురురాజ, సీనియర్ అసిస్టెంట్ శ్రీవాణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టరేట్ ప్రజావాణికి 55, పోలీస్ ప్రజావాణికి 20 ఫిర్యాదులు

● అధికారులను ఆదేశించిన కలెక్టర్, ఎస్పీ



ప్రజావాణిలో బాధితుల ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి 55 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

● **జిల్లా పోలీసు కార్యాలయంలో..**

గద్వాల క్రైం : ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 20ఫిర్యాదులు రాగా నేరుగా ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఇందులో ముఖ్యంగా భూ వివాదాలకు సంబంధించి 12, ప్లాట్స్ కబ్జాకు సంబంధించి 4, గొడవకు సంబంధించి 1, బాలిక మిస్సింగ్‌కు సంబంధించి 1, ఇతర అంశాలకు సంబంధించి 2 ఫిర్యాదులు రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన మంత్రికి శుభాకాంక్షలు



బాధ్యతలు స్వీకరించిన మంత్రి శ్రీహరికి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న ముదిరాజ్ నాయకులు

గద్వాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత సోమవారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి గద్వాల నుంచి పెద్ద సంఖ్యలో ముదిరాజ్‌లు హాజరయ్యారు. తెలుగు ముదిరాజ్ మత్స్యకారుల సంఘంజిల్లా అధ్యక్షుడు కబీర్‌దాస్ నర్సింహులు, తాలుకా అధ్యక్షుడు టీఎస్ఆర్ జగదీశ్ ఆధ్వర్యంలో నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలూకా ప్రధాన కార్యదర్శి దడవాయి నర్సింహులు, చేపల చిన్న తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు భర్తీ చేయాలి



కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

గద్వాల క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కమిటీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలోనే విద్యాపరంగా వెనుకబడిన జిల్లాగా గద్వాల జిల్లా ఉండటం దురదృష్టకరమని, ముఖ్యంగా కే.టిదొడ్డి, గట్టు మండలాల్లో విద్యాశాతం, అక్షరాస్యత తక్కువగా ఉన్నదన్నా రు. కే.టీదొడ్డి మండలంలో 100 మంది, గట్టు మండలంలో 80 మంది ఉపాధ్యాయుల కొరత ఉన్నదన్నారు. అలాగే గద్వాల జిల్లాలో మొత్తం 1500 మంది ఉపాధ్యాయుల కొరత ఉందనే విషయం అధికారులు గమనించాలన్నారు. జిల్లాలో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని, విద్యార్థులు లేరనే నెపంతో మూసివేస్తున్న ఏకోపాధ్యాయ పాఠశాలలను తిరిగి తెరిపించాలన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను నియమించలేదని పక్షంలో విద్యా వలంటీర్లను నియమించి విద్యాప్రమాణాలను పెంచాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగర్‌దొడ్డి వెంకట్రాములు, చాకలి ఆంజనేయులు, ఆటోమ క్బాల్, వెంకటస్వామి, అతికూర్ రహెమాన్, మాచర్లప్రకాష్, మోహన్‌రావు, అనిమిరెడ్డి, చిన్నపాడు ఆంజనేయులు, హనుమంతు, వీరన్న, ప్రభాకర్ ఉన్నారు.

పాఠశాలల్లో గత సిబ్బందినే కొనసాగించాలి

గద్వాల క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో పనిచేస్తున్న వారినే ప్రస్తుతం కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు సంబంధం లేకుండా నేరుగా కార్మికుల ఖాతాలలోనే నగదును జమచేయాలని, గత విద్యాసంవత్సరం పెండింగ్‌లో ఉన్న ఒకనెల వేతనాన్ని తక్షణమే విడుదల చేయాలన్నారు. పాఠశాలలను పరిశుభ్రపరడానికి అవసరమైన మెటీరియల్‌ను ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నరసింహ్మా, పారిశుధ్య కార్మికుల సంఘం పట్టణాధ్యక్షులు రఘు, కార్మికులు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమం, భద్రత బీజేపీ లక్ష్యాలు

గద్వాల టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధి, దేశ భద్ర త ప్రధాన లక్ష్యాలుగా కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకట్రాములు అన్నారు. నరేంద్ర మోదీ 11ఏళ్ల పాలన విజయాలను వివరించేందుకు సోమవారం పట్టణంలోని 36వ వార్డు పరిధిలో పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని వెంకట్రాములు మాట్లాడారు. పార్టీ సీనియర్ నాయకుడు బలిగెర శివారెడ్డి మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి కోసం సమాన దృష్టితో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశ భద్రత, సమగ్రతలకు అధిక ప్రాధాన్యతనిస్తూ రక్షణ రంగానికి భారీ కేటాయింపులు జరిపిన విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దేవదాసు, నాయకులు డబ్బిలేటి నరసింహ, డీల్లీవాలా కృష్ణ, మోహన్ రెడ్డి, నరసింహ శెట్టి ఉన్నారు. అనంతరం మొక్కలు నాటారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల సంఖ్య పెంచాలి

● జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర

గద్వాల క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల సంఖ్యను పెంచాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర, డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర అధ్యక్షతన అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ తన్వీర్ రిజ్వానా, ప్రసూనారాణి, సంధ్యకిరణ్మయి, చైతన్యజ్యోతి, వంశీ, చైతన్య, వైద్యసిబ్బంది మధుసూదన్‌రెడ్డి, నరేంద్రబాబు, వరలక్ష్మి, భారతి ఉన్నారు.

పరిహారం కోసం ఇంటి ముందు బైఠాయింపు

» భార్యతో కలిసి గట్టు మండలం ఆరగిద్ద చిన్నహనుమంతు నిరసన

గద్వాల క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తిని గాయపర్చి నష్టపరిహారం ఇస్తానని చెప్పి, పది నెలలుగా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండటంతో ఆదివారం ఆ వ్యక్తి ఇంటిముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటన జిల్లాకేంద్రంలోని బీరెల్లి చౌరస్తా సమీపంలో చోటుచేసుకొన్నది. బాధితుల కథనం ప్రకారం.. గట్టు మండలం ఆరగిద్ద గ్రామానికి చెందిన చిన్నహనుమంతు పదినెలల క్రితం వ్యవసాయ పొలానికి వెళ్తుంగా గద్వాలకు చెందిన ఉప్పల్ విజయ్‌రెడ్డి తన బొలెరో వాహనంతో ఢీ కొట్టాడు. చిన్నహనుమంతుకు కాలు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో తనపై కేసు పెట్టవద్దని, ఆస్పత్రిలో చికిత్సకు అయ్యే ఖర్చు రూ.10లక్షల దాకా తానే భరిస్తానని నమ్మబలికాడు. అప్పటికప్పుడు ఆయన ఫోన్‌పే ద్వారా రూ.లక్ష పంపాడు. చికిత్స నిర్వహిస్తుండగానే మిగితా డబ్బులు ఇవ్వాలని కోరగా పట్టించుకోలేదని, తర్వాత పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా న్యాయం జరగకపోవడంతో ఆదివారం సాయంత్రం గద్వాలలో ఉప్పల్ విజయ్‌రెడ్డి ఇంటిముందు చిన్నహనుమంతు, తన భార్యతో కలిసి బైఠాయించాడు.

ఈ విషయంపై గట్టు ఎస్ఐ కే.టి. మల్లేష్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తాను కోర్టులోనే తేల్చుకుంటానని చెప్పాడని తెలిపారు.